క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



కుమారా రామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వినియోగదారులు హక్కులను సాధించుకోవాలి

పెద్దాపురం: వినియోగదారులు తమ హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వినియోగదారుల సంఘం అధ్యక్షుడు భళ్లమూడి సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని 1, 2వ వార్డు సచివాలయంలో సోమవారం సాయంత్రం వినియోగదారుల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రశీదు తీసుకోవాలన్నారు. సినిమా థియేటర్లలో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోయినా, అసౌకర్యంగా అనిపించినా వినియోగదారుల తరుపున ప్రశ్నించవచ్చన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు అదనపు సొమ్ములు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కిరాణా, కూరగాయాలు కొనుగోలు చేసేటప్పుడు తూకాలు సరిగ్గా చూడాలని తేడాలు ఉంటే వినియోగదారులు తమ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని సూర్యనారాయణ అన్నారు. అనంతరం వినియోగదారుల చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు.

ఎమ్మెల్యే దొరబాబు పరామర్శ



బాబూరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: ఇటీవల మృతి చెందిన గొల్లప్రోలు చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు బందారు బాబూరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాబూరావు కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నేతలు జ్యోతుల భీముడు, మొగలి అయ్యారావు, గంగ్రేటి శ్రీరామచంద్రమూర్తి, తెడ్లపు చిన్నారావు తదితరులున్నారు.

వార్డుల్లో ఫీవర్ సర్వే



అయోధ్యరామపురంలో సర్వే చేస్తున్న సిబ్బంది

సామర్లకోట: ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయనే ఫిర్యాదుల మేరకు మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ ఆదేశాల మేరకు సోమవారం ఫీవర్ సర్వే ప్రారంభించారు. ఆయా సచివాలయాల ఏఎన్ఎంల ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటా సర్వే చేశారు. ఏమాత్రం జ్వరానికి సంబంధించి సూచనలు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, కాసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ కారే సుధ

కొత్తపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసిందని, రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆరోగ్య కేంద్రం డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్, ఎంపీపీ కారే సుధ అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆరోగ్య కేంద్రం డెవలప్‌మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో సమస్యలను, రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అనిశెట్టి సుభాషిణి, వైద్యాధికారిణి రమ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా పదికి అడుగులు

- విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు నమూనా పరీక్షలు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- నిత్యం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

కొత్తపల్లి: పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుండంతో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో నెలకొన్న భయాన్ని పోగొట్టేందుకు నమూనా పరీక్షలు నిర్వహిస్తు అసలు పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. నమూనా పరీక్షల ఫలితాల్ని విశ్లేషించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులంతా కృషి చేస్తున్నారు.

ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని 65 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5,160 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థుల్ని సన్నద్ధం చేయడంలో భాగంగా రోజూ ఉదయం పాఠశాల ప్రారంభానికి ముందు, సాయంత్రం పాఠశాల ముగిశాక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠాలను కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఒత్తిడికి గురవుతున్న విద్యార్థుల్ని గుర్తించి వారికి ఎలా చదవాలో తెలియజెప్పుతున్నారు. ఏకాగ్రతతో చదువుతూ ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. ప్రణాళిక ప్రకారం చదవడం ద్వారా మంచి మార్కులు సాధించడం కష్టమేమి కాదంటున్నారు. రోజూ నమూనా పరీక్షలు నిర్వహిస్తూ ఫలితాల్లో వెనకబడుతున్న విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. బట్టీ విధానానికి స్వస్తి పలికి అవగాహనతో పాఠాలు చదివి పరీక్షలకు సన్నద్ధం కావాలంటున్నారు. ప్రతి పాఠాన్ని విశ్లేషణగా చదివితే సులువుగా అర్థమవ్వడంతో పాటు బాగా గుర్తుండిపోతాయంటూ సూచిస్తున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



పదో తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. విద్యార్థులందరూ వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా మా వంతు కృషి చేస్తున్నాం.

– అరుణకుమారి, ప్రధానోపాధ్యాయురాలు, వాకతిప్ప

పట్టుదలతో చదువుతున్నా



రోజూ తెల్లవారుజామున 5 గంటలకు లేచి పట్టుదలతో చదువుతున్నాను. మాకు తెలియని విషయాలుంటే ఉపాధ్యాయులు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

– జ్యోతుల భువన గంగ మహేశ్వరి, పదో తరగతి విద్యార్థిని, వాకతిప్ప

నమ్మకాన్ని వమ్ము చేయను



ఉపాధ్యాయులు, మా అమ్మానాన్న నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయను. మా ఉపాధ్యాయులు పాఠ్యాంశాల వారీగా రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారి సలహాతో పాఠాలన్నీ విశ్లేషణాత్మక పద్ధతిలో చదువుకుంటున్నాను.

– టి.తులసి, పదో తరగతి, వాకతిప్ప

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఆలీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని, మునుపెన్నడూ లేనంతగా సంక్షేమం చేసి చూపించిందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఇటీవల కాకినాడ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన పిఠాపురంకు చెందిన ఎండీ జహూర్ ఆలీ సోమవారం పిఠాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే దొరబాబుకు ఎండీ జహూర్ ఆలీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కొత్తపల్లి: అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని ఉప్పాడలో బేతెల్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు హాజరయ్యారు. ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాలకు శ్మశానవాటిక లేక ఇబ్బంది పడుతున్నామని, శ్మశానవాటిక కోసం ఐదెకరాల స్థలం కేటాయించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ శ్మశానవాటికకు స్థలం కేటాయిస్తామని బదులిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని కులాలకు, అన్ని మతాలకు మేలు జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, పచ్చ చొక్కాలు, ఎల్లోమీడియా తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నాయని చెప్పారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా పాస్టర్లకు గౌరవ వేతనాన్ని కల్పించామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబును పాస్టర్స్ సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచ్‌లు నక్కా మణికంఠబాబు, రావి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదాల విక్రయాలపై అసంతృప్తి

వాడీవేడిగా సాగిన ట్రస్టు బోర్డు సమావేశం



సామర్లకోట పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు సమావేశం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయం ట్రస్టు బోర్డు సమావేశం వాడీవేడిగా జరిగింది. సోమవారం ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు అధ్యక్షతన ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. దేవస్థానం చేస్తున్న ప్రసాదాల విక్రయాలపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేజీకి ఎన్ని ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్నారని, ప్రసాదం టిక్కెట్లు కంప్యూటర్‌లో ఎందుకు నమోదు చేయడంలేదని ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట్రావు, నాతిపాముల సూరిబాబు, కౌన్సిలరు నేతల హరిబాబు ప్రశ్నించారు. ఒకేసారి రద్దీ ఎక్కువగా ఉండడంతో కంప్యూటర్‌లో రసీదులు ఇవ్వలేక పోతున్నామని ప్రసాదం విక్రయ గుమాస్తా తెలిపారు. ప్రసాదం విక్రయంపై పర్యవేక్షణ ఉండాలని, ప్రతి ప్యాకెట్టు విక్రయానికి రసీదులు ఉండాలని ట్రస్టు బోర్డు సభ్యులు డిమాండ్ చేశారు. అదేవిధంగా దేవస్థానంలో చేసిన ఖర్చులను అన్నదానంలో రాయడం సరికాదని, దేనికి అదే ప్రత్యేకంగా ఖర్చులు ఉండాలన్నారు. ఆలయానికి వచ్చిన ఆదాయం, ఖర్చులను ట్రస్టుకు తప్పనిసరిగా తెలియజేయాలని ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓ డి.నాగామల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు చల్లా కుమారి, కర్రి వెంకటలక్ష్మి, బొండలపు కృష్ణవేణి, ముమ్మిడి బేబిరాణి, ఎక్స్ అఫిషియో సభ్యుడు కొంతేటి జోగారావులు పాల్గొన్నారు.

నవ ధాన్యాల సాగుతో భూమి సారవంతం



నవధాన్యాల విత్తనాల ప్యాకెట్లు తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధులు

సామర్లకోట: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షరాలు రేగుల రాఘవ అన్నారు. ఆర్బీకేల్లో వ్యవసాయ సిబ్బందితో స్థానిక టీటీడీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈసందర్భంగా రాఘవ మాట్లాడుతూ నవధాన్యాల సాగు భూమిని సారవంతం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రైతు నవధాన్యాల సాగు చేయాలన్నారు. ఈ మేరకు నవధాన్యాలకు సంబంధించి 30 రకాల విత్తనాలతో కిట్లను తయారు చేసి ఆసక్తి ఉన్న రైతులకు అందజేస్తామన్నారు. పప్పు దినుసులు ఐదు రకాలు, చిరుధాన్యాలు ఐదు రకాలు, పచ్చిరొట్ట ఎరువులు మూడు రకాలు, నూనె జాతి రెండు రకాలు, ఆకు కూరలు 8 రకాలు, సుగంధ ద్రవ్యాలు మూడు రకాలు మొత్తం 30 రకాల విత్తనా కలిపి ఎద జల్లుకొవచ్చునని చెప్పారు. 45 రోజుల తరువాత భూమిలో కలియ దున్నడం వల్ల ఎకరానికి 30 టన్నుల పచ్చిరొట్ట ఎరువులు భూమికి అందుతాయని పేర్కొన్నారు. వాన పాములు వృద్ధి చెంది భూమి గుల్లబారుతుందని తెలిపారు. రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘ కార్యదర్శి సంగాడి ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు, చింపల్లి నాగమణి, ఈసీ సభ్యుల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

కొత్తపల్లి: ప్రపంచ డీవార్మింగ్‌డే సందర్భంగా మంగళవారం నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక సోమవారం తెలిపారు. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వైద్య సిబ్బంది ఈ మాత్రలను పంపిణీ చేస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశాలు, మెడికల్ సిబ్బంది పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

సచివాలయానికి వాటర్ ప్యూరిఫయర్ అందజేత



పంచాయతీ సిబ్బందికి ప్యూర్‌ఫైర్‌ను అందజేస్తున్న సర్పంచ్ అబ్బాయి

పెద్దాపురం: చదలాడ గ్రామ సచివాలయానికి గ్రామ సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి సోమవారం కూలింగ్ డిస్పెన్సరీని బహూకరించారు. సచివాలయ సిబ్బందికి సురక్షిత మంచినీటి వసతి కల్పనలో భాగంగా సర్పంచ్ సహకారంతో సుమారు రూ.10వేలు విలువ చేసే ప్యూరిఫయర్ కూలింగ్ వాటర్ డిస్పెన్సరీని పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు వి.శ్రీనివాస్, నాగులాపల్లి అప్పారావు, సాయి కిరణ్, చిట్టితల్లి, తాడాల దేవి, గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'స్పందన'

- పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు
- స్పందనకు ఎనిమిది అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందినట్టు ఆయన తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్ స్థాయి స్పందనకు వచ్చిన ఫిర్యాదులను డివిజన్ స్థాయి అధికారులు, మండల స్థాయిలో అయితే తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల అధికారులకు అప్పగిస్తామని, ప్రతి అర్జీని తప్పనిసరిగా పరిష్కరించాల్సిన బాధ్యత వారిపై ఉంటుందని తెలిపారు. ఈ వారం నిర్వహించిన స్పందనకు తొమ్మిది అంశాలపై ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించామని ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భాను కుమార్ తదితరులున్నారు.

టీడీపీ నేతల అవినీతి అందరికీ తెలిసిందే

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలో పేదలకు పంపిణీ చేసే ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూమి కొనుగోలు వ్యవహారంలో ప్రస్తుత అధికార పార్టీ నేత అవినీతికి పాల్పడిన్నట్టు అవకతవకలు జరిగిన్నట్టు టీడీపీ నాయకుడు ఎలో మీడియా పత్రికలో రాయించకోవడం దొంగే దొంగా దొంగా అన్నట్టుందని సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మలకల వరహాలబాబు, అన్నపూర్ణ లిఫ్టు ఇరిగేషన్ సొసైటీ అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస ప్రకాశం ధ్వజమెత్తారు. సోమవారం సాయంత్రం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పలువురు వైఎస్సార్ సీపీలోకి చేరడంతో ఏమి చేయాలో తెలియక టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇళ్ల స్థలాల కోసం భూమి సేకరించిన నాయకుడు ఎవరో అందరికి తెలుసు అని, ఆ స్థలాలు వ్యవహారంలో ఎవరి వాటా ఎంతో నిజానిజాలు తేల్చడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామంలో గుండు, పేకాట శిబిరాలు నిర్వహిస్తున్న ఘనత టీడీపీ నాయకులకే దక్కిందన్నారు. పీబీ దేవంలోని వైఎస్సార్ సీపీ నాయకులను విమర్శించే అర్హత టీడీపీ నాయకులకు లేదన్నారు.

అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు

- డీవైఈవో జాన్ డానియేల్ రాజు
- ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో జాన్ డానియేల్ రాజు

కాకినాడ రూరల్: విద్యాహక్కు చట్టం నిబంధనలు ప్రకారం అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేదలకు కేటాయించినట్టు కాకినాడ డీవైఈవో జాన్ డానియేల్ రాజు స్పష్టం చేశారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లతో కాకినాడ డీవైఈవో జాన్ డానియేల్ రాజు అధ్యక్షతన కాకినాడ రూరల్ ఎండీవో కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం కింద ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో (ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్)లలో 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం మార్చి 4న ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. విద్యాహక్కు చట్టం నిబంధనలు ప్రకారం అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను కేటాయించినట్టు చెప్పారు. ఇందులో భాగంగా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వివిధ వర్గాలకు చెందిన వారు (అనాథ పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధి బాధిత పిల్లలు, దివ్యాంగుల కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఓసీలకు చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు) కేటాయించినట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.1,20,00లుగా, పట్టణ ప్రాంతాల్లో రూ.1,44,000 ప్రాతిపదికన తీసుకుని వారి కుటుంబాల పిల్లలు అర్హులుగా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. అన్ని పాఠశాలల రిజిస్ట్రేషన్లు ఈ నెల 6 నుంచి 16వ తేదీ వరకూ, విద్యార్థుల ప్రవేశానికి రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకూ అవకాశం ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవో ఎల్.గణేష్‌బాబు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం



చిన్నను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మూలపేటకు చెందిన వాసుపల్లి చిన్న కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మండల కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు అనాల సుదర్శన్, మత్స్యకార నాయకుడు కంబాల లక్ష్మణ్ తదితరులున్నారు.

ఆర్థిక క్రమశిక్షణ లోపిస్తే కుటుంబంలో అశాంతి

కాకినాడ రూరల్: ఆర్థిక క్రమశిక్షణ లోపిస్తే కుటుంబంలో అశాంతి, పోషణలో ఇబ్బందిలోస్తాయని, బాల్యం నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నేటి యువతకు కనీస అవసరాలకు, విలాసాలకు మధ్య వ్యత్యాసం తెలియడం లేదని, ఆదాయంలో కొంత సొమ్మును పొదుపు చేసుకోవాలని సూచించారు. ఆర్థిక క్రమ శిక్షణ లోపిస్తే కుటుంబంలో అశాంతి, భవిషత్‌పై అనిశ్చితి, ఇంట్లో గొడవలు, కుటుంబ పోషణలో ఇబ్బందులు, పిల్లల పెంపకంలో అశ్రద్ధ వంటి సమస్యలు అనునిత్యం వెంటాడుతాయన్నారు. తద్వారా న్యాయ స్థానాలలో కేసులు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేత



విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేసిన సుబ్బారావు, వైస్‌చైర్మన్ తదితరులు

సామర్లకోట: పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు అన్నారు. స్థానిక సీబీఎం హైస్కూల్ ఆవరణలో పట్టణంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు అట్టలు, పెన్నులు, రబ్బర్లు, హాల్‌టిక్కెట్టు పోచ్‌లు అందజేసి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, గోకిన సునేత్రా దేవి, కౌన్సిలరు పిట్టా సత్యనారాయణ, మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, మాజీ కౌన్సిలర్లు దూది రాజు, లక్ష్మీ సత్యనారాయణ, పాస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.